

'కోట మైసమ్మ' స్థలాన్ని పరిరక్షించండి

చౌదరిగూడ, ఆగస్టు 17: అన్యాక్రాంతమవుతున్న కోటమైసమ్మ ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని వీరన్నపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వీరన్నపేట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ ఎ4లో 11 గుంటల భూమిలో అతి పురాతనమైన కోట ఉందని, అందులో గుప్త నిధులు ఉన్నాయని కొందరు తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్తులంతా తవ్వకాలను అడ్డుకుంటున్నామని, ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకట్రాములు, అంజయ్య, హరీష్ తదితరులు ఉన్నారు.



రెడ్డిపాలెంలో ఏపుగా పెరిగి పూత దశకు చేరిన పత్తి పంట

ఆశల పైరు

తెల్ల బంగారం రైతుల్లో ఆశలు కలిగిస్తోంది. వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేసిన పంట పూత దశకు రావడంతో మంచి దిగుబడి వస్తుందన్న ఆనందంలో రైతులున్నారు. నిన్న మొన్నటి వరకు సరైన వర్షాలు లేక ఎండుముఖం పట్టిన పత్తి మొక్కలు ఇప్పుడు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పూత కూడా వస్తుండడంతో రైతన్నల ముఖంలో సంతోషం తొణికిసలాడుతోంది. దిగుబడి కూడా బాగా వస్తుందని, ఈసారి లాభాలు వస్తాయన్న ఆశలో ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి ఏపుగా పెరగడంతో పల్లెల్లో పచ్చదనం సంతరించుకుంది. పచ్చని పంట పొలాలు వీనుల విందుగా దర్శనమిస్తున్నాయి.

- కొత్తూరు, ఆగస్టు 17



అమనగల్లులో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

నిరసన హోరు

కోల్‌కతా ఆర్‌జీకర్ వైద్య కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది శనివారం ఆందోళన నిర్వహించారు. పలుచోట్ల ర్యాలీలు చేశారు. మానవహారం నిర్వహించారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడ్డ దుండగులకు మరణ శిక్ష విధించాలని, వైద్యులపై దాడులు నివారించి వారికి రక్షణ కల్పించాలని, కలకత్తా సంఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత వైద్యురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా

వారు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయడానికి అర్హులు. కానీ వారు వచ్చీరాని వైద్యంతోనే ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. కమీషన్ల కోసం ఇబ్బడిముబ్బడిగా మందులు, యాంటీబయాటిక్స్ రాస్తుంటారు. అవి వాడిన రోగులకు కొత్త రోగాలు రావడం, కిడ్నీలు ఫెయిలవడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలు కూడా పోతుంటాయి. ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లు పల్లెటూరులో పెద్ద డాక్టర్‌గా చెలామణి అవుతున్నారు. చిన్న గదిలోనే పెద్ద ఆసుపత్రి మాదిరిగా అనుమతి లేని వైద్యంతో గ్రామీణులు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గ్రామాల్లో వైద్యం పేరుతో దోచేస్తున్నారు.



తనిఖీలు చేస్తున్నాం



జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తే క్రిమినల్ కేసులు తప్పవు. కొత్తూరులో గిరిజన బాలిక అబార్షన్ కేసులో శ్రీనివాస్ క్లినిక్‌ను సీజ్ చేశాం. జిల్లాలో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. లింగనిర్ధారణ పరీక్షలు గుట్టుగా చేసే డయాగ్నస్టిక్ సెంటర్లపై ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే ఆ సెంటర్ అనుమతిని రద్దు చేయాల్సి ఉంటుంది.

- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

అంతా మా ఇష్టం!

అనుమతి లేకుండానే వైద్యం

- గుట్టుగా సాగుతున్న లింగ నిర్ధారణ పరీక్షలు
- కాసులు తీసుకొని పెద్ద ఎత్తున అబార్షన్లు
- డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- గిరిజన బాలికకు అబార్షన్ చేసినందుకు క్లినిక్ సీజ్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 17 : జిల్లాలో 5వేల మందికి పైగా ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లు, 700కు పైగా డయోగ్నస్టిక్ సెంటర్లున్నాయి. వీటిలో చాలావరకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా లింగనిర్ధారణ, అబార్షన్ కేసులు ఎక్కువయ్యాయి. గుట్టుగా అబార్షన్ చేస్తున్నారు. కొత్తూరులో ఓ ఆర్‌ఎంపీ డాక్టర్ గిరిజన బాలికకు అబార్షన్ చేసిన విషయం రాష్ట్రంలోనే తీవ్ర కలకలం రేపింది. విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో ఈ కేసులో కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీనివాస క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి సీజ్ చేశారు. బయటకు రాకుండా కొనసాగుతున్న ఇలాంటి కేసులు జిల్లాలో ఇంకా ఎన్నో ఉన్నాయి. జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణ కొరవడటంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఇష్టారీతిగా అబార్షన్లు

జిల్లాలోని అనేక ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే పురిట్లోనే ప్రాణాలు తీసేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేయిస్తున్నారు. జిల్లాలో పలు ఆసుపత్రుల నిర్వాహకులు ఇష్టారీతిగా అబార్షన్ల దందా సాగిస్తున్నారు. గర్భిణులు ఆరోగపరమైన కారణాల వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో అబార్షన్ చేయించుకోవాల్సి వస్తే వైద్యాధికారులకు సమచారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ నిబంధనలను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఈ ఆసపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై వైద్యాధికారులు తనిఖీలు చేపట్టి వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడింది ఆట పాడింది పాటగా తయారైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావిడిగా వెళ్లి తనిఖీలు చేస్తున్నారు.

జ్వరాల సీజన్‌లో అప్రమత్తంగా లేకపోతే..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, చికున్‌గున్యా, డయేరియా వంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గ్రామీణ రోగులకు ఆర్‌ఎంపీలు అందుబాటులో ఉండటంతో జ్వర పీడితులు వెంటనే వారిని ఆశ్రయిస్తున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలు జ్వర పీడితులను ప్లేట్‌లెట్స్ తగ్గాయంటూ భయపెట్టి పట్టణాల్లో ఆసుపత్రుల్లో చేర్పించి వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పట్టణాల్లోని ఆసుపత్రిలో చేర్పించినందుకు వారు 30శాతం డబ్బులు వీరికి చెల్లిస్తున్నట్టు సమాచారం.

గుట్టుగా లింగ నిర్ధారణ

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుగా జరుగుతున్నాయి. కాసులకు కక్కుర్తిపడి పలు స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రుల నిర్వాహకులు కడుపులో పెరుగుతుంది ఆడ బిడ్డో, మగ బిడ్డో ముందుగానే నిర్ధారిస్తున్నారు. ఫలితంగా బాలుర నిష్పత్తితో పోలిస్తే బాలికల నిష్పత్తి తక్కువగా నమోదవుతోంది. ఎప్పటికప్పుడు ఆయా సెంటర్లను తనిఖీలు నిర్వహించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన

- వ్యవసాయ, వ్యవసాయేతర భూముల విషయంలో తలెత్తుతున్న సమస్యలపై కేంద్ర అధికారుల ఆరా
- శంషాబాద్ తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించిన రాష్ట్ర, కేంద్ర భూవనరులు విభాగం అధికారులు

శంషాబాద్, ఆగస్టు 17 : జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం సాయంత్రం అధికారులు శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర భూవనరుల శాఖల అధికారులతో పాటు కలెక్టర్ శశాంక ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాకు సంబంధించి ధరణి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శంషాబాద్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో, వ్యవసాయేతర భూములకు సంబంధించి చేపడుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. కేంద్ర భూవనరుల విభాగం సెక్రటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రటరీ కునాల్‌లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియపై రాష్ట్ర భూ పరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ వివరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఏవైనా ఇబ్బందులు, సమస్యలు తలెత్తినప్పుడు ఏ విధంగా పరిష్కరించి రిజిస్ట్రేషన్ పక్రియను పూర్తి చేస్తారని వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్ రమాదేవి, తహసీల్దార్ రాములు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రియల్టర్లపై చర్యలు తీసుకోండి: జంగయ్య

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17: మండలంలోని నాగన్‌పల్లి రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 189లో అసైన్డ్ భూముల నుంచి అక్రమంగా రోడ్డు వేస్తున్న రియల్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహులు డిమాండ్ చేశారు. శనివారం నాగన్‌పల్లిలో సర్వేనెంబర్ 189లోని అసైన్డ్ భూములను సీపీఐ బృందం పరిశీలించింది. ఇక్కడ నాగన్‌పల్లి ప్రభుత్వ భూములను అనుసరించి ఉన్న అబ్దుల్లాపూర్ మండలం అనాజ్‌పూర్‌లో సర్వేనెంబర్ 281లో ఉన్న ప్రభుత్వ భూములను కూడా కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిలింసిటీ పక్కన ఉన్న ప్రభుత్వ భూములపై గతంలో పేదలకు ఇంటి పట్టాలిచ్చారని, వారికి వెంటనే పొజిషన్ చూపాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి, పర్వతాలు, లక్ష్మణ్, మొల్గు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర శికారి గ్యాంగ్ అరెస్ట్

తండ్రీకొడుకులే ప్రధాన నిందితులు

- కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో ఇద్దరిపై 112 పైగా కేసులు
- జూన్ 30న పరిగిలో ఐదు ఇళ్లలో చోరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



పోలీసుల అదుపులో తండ్రీకొడుకులు

వికారాబాద్, ఆగస్టు 17: తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల్లో వరుసగా దొంగతనాలు చేస్తున్న శికారి గ్యాంగ్‌ను అరెస్ట్ చేయడం జరిగిందని, పరిగి పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఐదు ఇళ్లలో దొంగతనం చేయడంతో దర్యాప్తు చేసి పట్టుకున్నామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంతకల్‌కు చెందిన శికారి గ్యాంగ్‌లో ప్రధాన నేరస్తులైనా తండ్రి పెద్ద సర్దార్, కుమారుడు శికారి మద్దిలేటి, సమీప బంధువులు చిన్న సర్దార్ అలియాస్ గబ్బార్ సింగ్‌లు జూన్ 29న రైలు మార్గం ద్వారా యాద్గిర్ అక్కడి నుంచి పరిగికి బస్సు మార్గం ద్వారా ఉదయం చేరుకున్నారు. 30వ తేదీన ఉదయం పరిగిలో రెండు షోలు సినిమా చూసిన నిందితులు రాత్రిమద్యం సేవించి రక్కి నిర్వహించారు. పరిగిలో తాళాలు వేసిన ఐదు ఇళ్లను వారు గుర్తించారు. రాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు ఐదు ఇళ్లలో దొంగతనం చేయగా అందులో ఓ ఇంటిలో 12 తులాల బంగారం, 1.20లక్షల నగదు, మరో ఇంటిలో 3.3 తులాల బంగారాన్ని దొంగలించారు. మూడు ఇళ్లలో దొంగలకు ఎలాంటి బంగారం, నగదు దొరకకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, టెక్నికల్ ఆధారాల ద్వారా నిందితులు గుంతకల్‌కు చెందిన శికారీ గ్యాంగ్‌గా గుర్తించడం జరిగిందన్నారు. అందులో చిన్న సర్దార్‌ను జూలై 29న అరెస్ట్ చేసి విచారించడం జరిగిందని, తండ్రీ కొడుకులు పూణెలో ఉన్నారని సమాచారం రావడంతో శుక్రవారం వారిని పూణెలో అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఓ సారి బూజు, తేజ అనే కొత్త వ్యక్తులను దొంగతనాలకు తీసుకోని పోయేవారని విచారణలో తెలిసిందన్నారు. పెద్ద సర్దార్‌పై అన్ని రాష్ట్రాల్లో కలిపి 70కి పైగా కేసులు ఉన్నాయని, శికారి మద్దిలేటిపై 42 దొంగతనం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. వారి వద్ద పది తులాల బంగారం రికవరీ చేయడం జరిగిందని, బంగారం కొనుగోలు చేసిన శికారి ఆది, పుణెకు చెందిన కంసార్ రాంచందర్ చవాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసును చేధించిన పరిగి సీఐ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ బలవంతయ్య, పరిగిఎస్‌ఐ సంతోష్, హెడ్ కానిస్టేబుల్స్ జయవర్ధన్, చెన్నయ్యగౌడ్, గోవిందప్ప, కానిస్టేబుల్స్ కృష్ణారెడ్డి, అంజప్ప, సత్తయ్య, రాజు, రాఘవేందర్ రెడ్డి, రామకృష్ణ గాయత్రిలకు రివార్డు అందించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

కొత్తూర్‌లో దేవతా మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



కొత్తూర్‌లో ఆధ్యాత్మిక శోభ

కొత్తూర్, ఆగస్టు 17: కొత్తూరు పరిధిలో గ్రామదేవతల ఆలయాల పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం రెండోరోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.30గంటల నుంచి పూజలు ప్రారంభించారు. ప్రాతఃకాలపూజ, చండీ పారాయణం, అష్టోత్తర శతకలశాధివాస పూజలు చేశారు. రాత్రి పట్టణంలో దేవతామూర్తులను ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ దంపతులు, ఇతర ముఖ్యులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవంతో కొత్తూర్ పట్టణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నర్సింహగౌడ్, హేమా దేవేందర్, ప్రసన్నలతా యాదయ్య, సోమ్లానాయక్, మాజీ ఎంపీపీ జె.వేణుగోపాల్‌గౌడ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, లక్ష్మయ్యయాదవ్, జె.సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్, గోవింద్‌రెడ్డి, కృష్ణయ్య, జనార్థన్, జె.శ్రీనివాస్, అంజయ్య, సురేందర్, కృష్ణగౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, కృష్ణ, రాఘవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో సహా.. చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

- కుటుంబ కలహాలే కారణం..
- తల్లి, కూతురు మృతదేహాలు లభ్యం
- కుమారుడి మృతదేహం కోసం గాలింపు

మూడుచింతలపల్లి, ఆగస్టు 17 : ఇద్దరు పిల్లలతో సహా తల్లి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రానికి చెందిన మర్కంటి భానుప్రియ(28) ఈనెల 15వ తేదీన రాత్రి తన భర్త మర్కంటి స్వామితో గొడవపడి కుమారుడు దేవాన్ష్‌ఆనంద్(5), కూతురు దీక్ష(4)లతో కలిసి బయటకు వెళ్లింది. రాత్రి వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో స్వామి మరుసటిరోజు ములుగు పోలీస్‌స్టేషన్‌లో భార్య, ఇద్దరు పిల్లలు తప్పిపోయారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం సాయంత్రం ఓ మహిళ, ఇద్దరు పిల్లలతో కలిసి శామీర్‌పేట పెద్దచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు మహిళ, చిన్నారి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వారి మృతదేహాలను పరిశీలించి ములుగుకు చెందిన మర్కంటి భానుప్రియ, చిన్నారి దీక్షగా గుర్తించారు. కుమారుడు దేవాన్ష్ ఆనంద్ మృతదేహం కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



భానుప్రియ, కూతురు దీక్ష, కొడుకు వేదాన్ష్ ఆనంద్(ఫైల్)

తమ్ముడి ప్రాణం తీసిన ఆస్తి వివాదం

- కొన్నేళ్లుగా అన్నదమ్ముల మధ్య భూ తగాదా
- కోర్టుల చుట్టూ తిరిగి నష్టాలపాలు
- ఎంతకూ రాజీకి రాని అన్న
- పురుగుల మందు తాగి తమ్ముడి బలవన్మరణం

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 17: అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూముల వివాదం ఏళ్ల తరబడి కోర్టులో పరిష్కారం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం షాద్‌నగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన తిరుపతయ్య(60), అతడి అన్న నాగయ్యల మధ్య చాలాకాలంగా వారసత్వ భూములపై వివాదం నడుస్తోంది. కోర్టులో కేసు వేశారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నామని, రాజీ కుదుర్చుకుందామని తిరుపతయ్య తన అన్నను బతిమాలేవాడు. శనివారం కూడా షాద్‌నగర్‌లో ఉన్న అన్న వద్దకు వచ్చి మాట్లాడాడు. అతడు రాజీకి ఒప్పుకోకపోవడంతో తిరుపతయ్య క్వార్టర్ మద్యం సీసాలో పురుగుల మందు కలుపుకుని తాగాడు. పట్టణంలోని హాజీపల్లి రోడ్డులోని కల్లు దుకాణం సమీపంలో పడిపోయి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. తిరుపతయ్య కుమారుడు హరినాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 17 : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి సూచించారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో డీసీపీ హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలు విక్రయించే స్మగ్లర్లు కళాశాలల విద్యార్థులను టార్గెట్‌చేసి వ్యాపారం చేస్తున్నారని, కాలేజీ పరిసరాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో ఎవరైనా మాదక ద్రవ్యాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న మైసమ్మగూడ ప్రాంతంలో వారానికి ఒకసారి తమ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుందన్నారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించరాదని ఆయన అన్నారు. ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, పేట్‌బషీరాబాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

ట్రెక్కింగ్ చేసిన ఎంపీ కొండా



బంట్వారం, ఆగస్టు 17: మండల సరిహద్దు కర్ణాటకలోని కుంచారం సమీపంలో ఉన్న ఎత్తిపోతల జలపాతం పరిసరాల్లో శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ట్రెక్కింగ్ చేశారు. ఆయన వెంట బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాండూర్ రమేష్, బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, పార్టీ మండలాధ్యక్షుడు తదితరులున్నారు.

పశువుల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డీఆర్డీఏ అధికారులు

మూడు చింతలపల్లి, ఆగస్టు 17 : పశువుల పెంపకం, పౌల్ట్రీ పరిశ్రమల నిర్వహణపై మహిళలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీఆర్డీఏ పీడీఏ లత అన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం మూడుచింతలపల్లిలో మహిళా సమాఖ్య సభ్యులకు పశుసంవర్ధక శాఖ అధికారులతో ప్రత్యేకంగా శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఏ లత మాట్లాడుతూ పశు పోషణ, పౌల్ట్రీ నిర్వహణ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్న మహిళలకు ఆర్థిక సాయం అందజేసి పాడి, పౌల్ట్రీ పరిశ్రమలు నెలకొల్పటానికి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సమాఖ్య సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏపీఎం మునిస్వామి, మండల సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే కరెంట్ తీస్తున్నారా?

● విద్యుత్ అంతరాయంపై అధికారులను నిలదీసిన కాంగ్రెస్ నాయకులు


సబ్‌స్టేషన్ వద్ద అధికారులను నిలదీస్తున్న నాయకులు

ధారూరు, ఆగస్టు 17: ప్రభుత్వం కరెంట్ కోతలు అమలు చేస్తుందా? చీటికీమాటికీ కరెంట్ తీస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారా? అని ధారూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ వేణుగోపాల్‌రెడ్డితో పాటు సిబ్బందిని నిలదీశారు. ఈ సంఘటన శనివారం ధారూరు సబ్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ధారూరు గ్రామంలో చీటికీమాటికీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని, ప్రతీరోజు గంటల తరబడి సరఫరాలో అంతరాయానికి కారణమేమిటని ఏఈని ప్రశ్నించారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి ధారూరులో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. రాత్రిపూట కరెంట్ తీస్తున్నారని, దోమల బెడదతో ప్రజలు సరిగ్గా నిద్రపోవడం లేదని అన్నారు. విద్యుత్ అంతరాయం తాండూరు నుంచి ఉందని సిబ్బంది చెప్పటంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సక్రమంగా లేకపోవటంతో ప్రజలు తమను ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా మీరు పని చేస్తున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. కాగా, విద్యుత్ లైన్లలో సమస్య, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు వివరించారు. వారి సమాధానంపై సంతృప్తి చెందని నాయకులు వికారాబాద్ ఏడీఏతో ఫోన్లో మాట్లాడి విద్యుత్ సమస్యను వివరించారు. ధారూరులో విద్యుత్ అధికారుల పనితీరు సక్రమంగా లేదని, స్థానికంగా ఉండటం లేదని, విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని వివరించారు. సోమవారం ధారూరుకు వచ్చి విద్యుత్ సమస్యపై చర్చించి పరిష్కరిస్తానని ఏడీఏ హామీ ఇవ్వటంతో వారు సబ్‌స్టేషన్ నుంచి వెనుదిరిగారు.

జిల్లా ఆసుపత్రి వద్ద కంపు కంపు

- ఇష్టారాజ్యంగా చెత్తాచెదారం పడేస్తున్న రోగులు, ప్రజలు
- చిన్నపాటి వర్షం పడితే ఎటూ వెళ్లలేని నీరు
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది

తాండూరు, ఆగస్టు 17: తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు వందకు పైగా పేషెంట్లు వస్తుంటారు. అయితే, ఆస్పత్రి ఎదుట రోగులు, ప్రజలు ఇష్టారాజ్యంగా చెత్తాచెదారం వేయడంతో పాటు అక్కడే కొంతమంది యూరిన్ పాస్ చేస్తున్నారు. దానికి తోడు చిన్నపాటి వర్షం పడితే చాలు అక్కడ మురుగు నీరు నిలుస్తోంది. దుర్వాసనతో రోగులు, అటుగా వెళ్లే ప్రజలు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి దాపురించింది. ఆస్పత్రి ఎదుట ఇలా ఉంటే రోగం నయం కావడం కంటే.. మరిన్ని రోగాలు వచ్చే అవకాశం లేకపోలేదు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యమో? జిల్లా ఆస్పత్రి శానిటేషన్ విభాగం సిబ్బంది లేకపోవడమో గానీ, ఇలా జరగడానికి కారణాలు ఏమున్నది తెలియరాలేదు. గతంలో కలెక్టర్ ఈ సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్ విభాగానికి చెందిన ఇన్‌చార్జి డీఈ పరిశీలించి వెళ్లారు. తదుపరి చర్యలు మాత్రం మరిచారు. ఈక్రమంలో శనివారం ఆసుపత్రికి వచ్చిన రోగులతో పాటు వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు.


ఆస్పత్రి ముందు వేసిన చెత్త.. రోడ్డుపై నిలిచిన నీరు

కూల్చిన స్థలంలోనే మసీదును పునరుద్ధరించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి ఎంబీటీ లేఖ

హైదరాబాద్,ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సంఘవిద్రోహులు మొయినాబాద్ లో కూల్చివేసిన మసీదును యథావిధిగా అదే స్థలంలో నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మజ్లిస్ బచావో తహ్రీక్(ఎంబీటి)అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాసారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో మసీదులు కూల్చివేత సంఘటనలపై ముస్లింలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని లేఖలో వివరించారు. మసీదు కూల్చివేత సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చినట్టు ఆయన గుర్తు చేశారు. యథాతథంగా కూల్చిన స్థలంలోనే మసీదును నిర్మిస్తామని వక్ఫ్‌బోర్డు అధికారులు హామీ ఇచ్చి మూడు వారాలు గడిచినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో తొమ్మిది మసీదులు కూల్చివేతకు గురయినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఫలితంగా ముస్లిం మైనారిటీలు కలిసి ఆయనను ఎన్నికల్లో తిరస్కరించారని గుర్తు చేశారు. సెక్యులర్ సీఎంగా చొరవ తీసుకుని మొయినాబాద్‌లో కూల్చినస్థలంలోనే మసీదును పునరుద్దరించాలని, ఈ విషయంలోముస్లిం మత ప్రతినిధులతో చర్చించేందుకు తగిన సమాయాన్ని కేటాయించాలని అంజదుల్లాఖాన్ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.


బాల సభలో మాట్లాడుతున్న విద్యార్థులు

ఆకట్టుకున్న విద్యార్థుల బాలసభ

ఆమనగల్లు, ఆగస్టు 17 : ఆమనగల్లులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం బాల సభ నిర్వహించారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలసభలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలసభ కొనసాగింది. విద్యార్థులచే నిర్వహించిన పొడుపు కథలు, వివిధ అంశాలపై ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్మన్‌ను కలిసిన టీఎస్ఎస్‌వో అధ్యక్షుడు లక్ష్మీనివాస్



తలకొండపల్లి, ఆ గస్టు 17: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదను శనివారం తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో శారదను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. మహిళలపై దాడులు, అత్యాచారాల నిరోధానికి కమిషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు లక్ష్మీనివాస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు

యాచారం, ఆగస్టు 17: కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. శనివారం విద్యార్థులు వచ్చేసరికి కిటీకీల సీకులు తొలగించి ఉన్నాయి. తరగతి గదిలో బిరాని ప్యాకెట్ పడేశారు. మధ్యాహ్న భోజన వంట గదిలోని 3 నూనె ప్యాకెట్లు, 2కారంపొడి డబ్బాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. ఇలాంటి సంఘటనలు ఇప్పటికి రెండు పర్యాయాలు జరిగినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు యువకుల ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


కుర్మిద్ద పాఠశాల, గదిలో లభ్యమైన బిర్యాని ప్యాకెట్

భవన నిర్మాణ కార్మికులకు సదుపాయాలు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

మహేశ్వరం, ఆగస్టు 17 : భవన నిర్మాణ కార్మికులకు ఇతర రాష్ట్రాల మాదిరిగా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. శనివారం మహేశ్వరంలో భవన నిర్మాణ కార్మిక సంఘంతో పాటు ఇతర కార్మికుల కూలీ రేట్లకు సంబంధించిన రేట్ల బోర్డును ఆయన ఆవిష్కరించారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు ద్విచక్ర వాహనాలు, పెన్షన్, సబ్సిడీతో కూడిన పరికరాలు అందజేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తెలంగాణలో ఉన్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోకుండా సెస్సు ద్వారా వస్తున్న డబ్బులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీస వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నా.. కార్మిక శాఖ ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులకు తగిన సదుపాయాలు కల్పించాలని, లేనిపక్షంలో కార్మికులకు అండగా సీఐటీయూ ఎంతటి పోరాటానికైనా వెనకాడబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో కవిత, రవికుమార్, శేఖర్, చంద్రయ్య, శ్రీశైలం, శంకర్, చెన్నయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడవద్దు


మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కందుకూరు, ఆగస్టు 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో శ్రీలత తెలిపారు. 2023-24 సంవత్సరానికిగాను మండలంలోని 35 గ్రామ పంచాయతీలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలానికి ఈ సంవత్సరం రూ.6కోట్ల20లక్షల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో ఆరు వేల 5 కుటుంబాలకు చెందిన కూలీలకు 3లక్షల 11వేల పనిదినాలను కల్పించినట్లు అధికారులు నివేదికలు ఇచ్చారని, దీనికిగాను భూమి అభివృద్ధి పనులకు, పండ్ల తోటల పెంపకానికి, హరితహారం ద్వారా మొక్కల పెంపకం.. గ్రామాల్లోకి తరలించడం, క్రీడాప్రాగంణం ఏర్పాటు, పశువుల పాకల నిర్మాణం వంటి పనులు చేపట్టి నేటి వరకు ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల నుంచి రూ.5కోట్ల 33లక్షల నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు వచ్చినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

యూరియా లొల్లి


రైతులను సముదాయిస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

బషీరాబాద్, ఆగస్టు 17: బషీరాబాద్ మండల కేంద్రంలోని నవాంద్గీ సొసైటీలో శనివారం రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ఒక్కొక్కరూ 5 నుంచి 10 బస్తాల యూరియా అడగడంతో సొసైటీ సిబ్బంది నిరాకరించడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అక్కడికి చేరుకుని సొసైటీ సీఈవో బందెయ్యతో యూరియా నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారిగా అవసరం లేకున్నా పెద్ద సంఖ్యలో రైతులు యూరియా కొనుగోలు చేసి ఇళ్లకు తరలించి నిల్వ చేసుకోవడంతో మిగతా రైతులకు కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. అవసరం మేరకు తీసుకెళ్తే మిగతా రైతులకు కూడా యూరియా ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులకు వివరించారు. యూరియా అవసరం మేరకు తీసుకెళ్లాలని రైతులకు సూచించారు.ఒక్కో రైతుకు ఎకరాకు ఒకటి, రెండు బస్తాలు ఇస్తామని, మళ్లీ స్టాక్ వస్తుందని అప్పుడూ తీసుకెళ్లాలని రైతులకు విన్నవించారు.ఆయన వెంట ఏఈవో పవాన్, శ్యామేల్ తదితరులున్నారు.

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై..

పెల్లుబికిన నిరసనలు

● వైద్యులు, విద్యార్థుల ర్యాలీలు



షాద్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

ఆమనగల్లు/షాద్‌నగర్/మాడ్గుల/చేవెళ్ల/శంషాబాద్/శంషాబాద్ రూరల్/ఇబ్రహీంపట్నం, ఆగస్టు 17 : పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో కొన్ని రోజుల క్రితం జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లాలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో శనివారం వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో కొద్ది సేపు విరామం ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. ఆమనగల్లులో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, సిబ్బంది నిరసనలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు, జూనియర్ కాలేజీ, కేజీబీవీ విద్యార్థినులు, ఉపాధ్యాయులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ కూడలి వరకు హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ర్యాలీ చేపట్టారు. రాజీవ్ చౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడ్డ దుండగులను పట్టుకొని మరణశిక్ష విధించాలని, వైద్యులపై దాడులు నివారించి రక్షణ కల్పించాలని, కోల్‌కతా ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు పరీక్షిత్, మంజులాదేవి, జయశ్రీ, షైమునా, చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, ప్రైవేట్ వైద్యులు బి.శ్రీనివాస్, స్నేహలతారెడ్డి, సిధులారెడ్డి, శ్రీధర్, ఎస్.నర్సింహులు, కేజీబీవీ ఎస్‌వో పద్మజ్యోతి, ఏబీవీపీ భరత్, శ్రీశైలం, మల్లేశ్, సాయి, విజయ్, నవీన్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య కేసులో నేర విచారణ జరపకుండా హంతకుడిని ఎన్‌కౌంటర్ చేయాలని ప్రైవేటు వైద్యులు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ కోల్‌కతా సంఘటన తర్వాత దేశంలోని వైద్యులంతా ఏకతాటిపైకి వచ్చి ఆందోళనలు చేయడం హర్షణీయమన్నారు. మాడ్గులలో స్కూళ్లు, కాలేజీల విద్యార్థులు ఎంబీబీఎస్ విద్యార్థి అరుణతేజ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన గుండాల అరుణ్‌తేజ, వేణుగోపాల్, వినయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. చేవెళ్ల డివిజన్ పరిధి ఆర్‌ఎంపీలు హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు రాంచందర్, కార్యదర్శి వీరానందచారి, కోశాధికారి ప్రభాకర్ పాల్గొన్నారు. శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్‌లో మహిళలకు రక్షణ కరువైందన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సంఘాల నాయకులు ప్రణయ్, ఆనంద్ మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితులను శిక్షించాలని డిమాండ్‌చేశారు. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది ఓపీ విధులను బహిష్కరించారు. ఆస్పత్రి నుంచి చౌరస్తావరకు ర్యాలీ నిర్వహించారు. ఉదయం 6నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేయాలని ఐఎంఏ పిలుపునిచ్చింది. దీంతో రోగులు ఆసుపత్రి వచ్చి తిరిగి వెళ్లిపోయారు. సీహెచ్‌సీ డిప్యూటీ సివిల్‌సర్జన్ జవహర్‌లాల్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్లలో నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీలు


శంషాబాద్‌లో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు


ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


మాడ్గులలో ర్యాలీ నిర్వహిస్తున్న కాలేజీ విద్యార్థులు

క్రైం కార్నర్

లిక్విడ్ గంజాయి విక్రేతల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

ఆదిభట్ల, ఆగస్టు 17 : ఆదిభట్ల పరిధిలో గంజాయి విక్రయిస్తూ శుక్రవారం పట్టుబడిన ముగ్గురిని శనివారం రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.30లక్షల విలువైన 3.8కిలోల గంజాయి లిక్విడ్, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏపీలోని విశాఖపట్నం జిల్లా కింతిలి వల్లాపురానికి చెందిన టి.సుధీర్, టి.దేముళ్లు వ్యవసాయం చేస్తుంటారు. ఇదే జిల్లా చిన్నపచిలకు చెందిన కె.శంకర్‌రావు కూల్‌డ్రింక్స్ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తుంటాడు. వీరు ముగ్గురికి పరిచయం ఉన్న ఒడిషాకు చెందిన శ్రీను అలియాస్ తేజా అనే వ్యక్తి ద్వారా ద్రవరూపంలోకి మార్చిన గంజాయిని లిక్విడ్(హహీష్ ఆయిల్)ను కొని హైదరాబాద్ పరిసరాల్లో ఐటీ ఉద్యోగులు, ఇంజినీరింగ్ విద్యార్థులకు విక్రయిస్తున్నారు. శుక్రవారం విశాఖ నుంచి హహీష్ ఆయిల్‌ను తెచ్చినట్టు సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్వోటీ టీం, పోలీసులు దాడిచేసి నిందితులను పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించారు. గంజాయి స్మగ్లింగ్ నిందితులు రూటు మార్చి ద్రవరూపంలోకి మార్చి హహీష్ ఆయిల్‌ను కిలో రూ.8లక్షలకు విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కిలో ఆయిల్ తయారీకి 35-40కిలోల ఎండు గంజాయిని వినియోగిస్తారన్నారు. కేవలం 5ఎంఎల్ హహీష్ ఆయిల్ తీసుకుంటేనే వ్యక్తి పూర్తి మత్తులోకి జారతాడన్నారు. సుధీర్, దేముళ్లు, శంకర్‌రావులను మాదక ద్రవ్యాల నిరోధక చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సైలు రాజు, వెంకటేష్, పోలీసులు శ్రీశైలం, బాలరాజు, ఎస్వోటీ టీం పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న మంచినీళ్ల బావి స్థలం

మంచాల, ఆగస్టు 17: ఆరుట్ల మంచినీళ్ల నల్లల బావి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామస్థులు అధికారులను కోరారు. కె.భాస్కర్, రమణారెడ్డి, అంతటి రాజు తదితరులు శనివారం మంచినీళ్ల నల్లల బావి ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడుజోళ్ల కుంట ప్రదేశంలో 60ఏళ్ల క్రితం మంచినీటి బావి కోసం అరెకరం స్థలం కొని బావి తోడించారన్నారు. ఇటీవల రియల్ వ్యాపారులు నల్లల బావి ప్రదేశంలో మట్టికట్టను కూల్చి కడీలు పాతి కబ్జాచేశారని చెప్పారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నీళ్ల బావి స్థలాన్ని కబ్జా చెర నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు.


మంచినీళ్ల బావి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


పోలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దిలీప్‌రాజ్

కడ్తాల్, ఆగస్టు 17: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కృష్ణవేణి పాఠశాల చైర్మన్ ఆర్.దిలీప్‌రాజు అన్నారు. కడ్తాలలోని కృష్ణవేణి పాఠశాలలో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగం, రాజకీయాలు, ప్రజాప్రతినిధుల విధులు, అధికారాలు తదితరాలపై అవగాహన కల్పించారు. అలాగే స్కూల్ ఎన్నికలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల అధ్యక్షురాలిగా జి.చందన, ఉపాధ్యక్షులు పి.మాన్సి, ప్రధానకార్యదర్శి ఆర్.చరణ్, కల్చరల్ కార్యదర్శిగా మీనాక్షి ఎన్నికయ్యారు. టెన్త్‌లో 10జీపీఏ సాధించిన కార్తీక్‌ను దిలీప్‌రాజ్ సత్కరించారు. ప్రోత్సాహకంగా రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈర్ల రవి, టీచర్లు సిరిలక్ష్మి, కుమార్, శ్రీకాంత్, అహ్మద్, రాకేశ్, మల్లేశ్, శివకళ, షబ్రీన్, మానస, సుమతి, పద్మ, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాలలో మోస్తరు వర్షం

కడ్తాల్, ఆగస్టు 17: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా సాయంత్రం మేఘాలు కమ్ముకొని వర్షం కురిసింది. ప్రధాన రహదారి, వీధుల్లో వాన నీరు ఉప్పొంగి ప్రవహించింది. మండల పరిధి పలుగ్రామాల్లోనూ వర్షం కురిసింది. పంటలకు ఈ వాన ఎంతో మేలు చేసిందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రాఖీ పండుగ విశిష్టమైనది


చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశంకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి మంజుల

చేవెళ్ల/తలకొండపల్లి/షాబాద్, ఆగస్టు 17: భారతీయ సంస్కృతిలో రాఖీ పండుగకు విశిష్టత స్థానం ఉందని చేవెళ్ల బ్రహ్మకుమారీలు అన్నారు. శనివారం చేవెళ్లలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ బి.కృష్ణయ్యలకు వారు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రక్షాబంధన్ పర్వ దినాన్ని పురస్కరించుకొని అధికారులకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. బ్రమ్మకుమారీ అక్కయ్య మంజుల మాట్లాడుతూ.. రాఖీ పండగ పవిత్రత కంకణమని వేదాల్లో ఉందని తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు బాల్‌రెడ్డి, గోపాల్, పాండు, రాఘవేంద్రచారి, వేణుగోపాల్‌చారి, భాగ్యలక్ష్మి,శశికళ, స్రవంతి పాల్గొన్నారు. తలకొండపల్లిలో పాఠశాలలు, కార్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకను నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సేవా ప్రముఖ్ జీనుకుంట్ల భాస్కర్, కడ్తాల ఖండ్ కార్యవాహ్ శివ, ధర్మజాగరణ కార్యకర్త శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.రక్షాబంధన్ వైశిష్ట్యాన్ని ఆర్ఎస్ఎస్ నాయకులు వివరించారు. అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు రక్షాబంధన్ ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖండ బోధక్ ప్రముఖ్ వినోద్, వ్యవస్థ ప్రముఖ్ పవన్, ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్, రాజు, వెంకటేశ్, డి.రవి, సాయిరామ్, శ్రీశైలం, రాఘవ, శ్రీధర్, అఖిల్,నాగరాజు పాల్గొన్నారు. రక్షాబంధన్ వేడుకను నాగర్‌గూడ శ్రీచైతన్య స్కూల్‌లో జరుపుకున్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిద్ధాపురం ప్రసాద్, టీచర్ శ్రీరాములు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.


తలకొండపల్లిలో పోలీసు అధికారులకు రాఖీ కడుతున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

షాద్‌నగర్, ఆగస్టు 17: పురాతన ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ శిథిలావస్థల్లోని ఆలయాలకు నిధులు సమకూర్చి అభివృద్ధి చేయిస్తామన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ అగ్గనూరు విశ్వం, శ్రీశైలంగౌడ్, అగ్గనూరు బస్వం, కట్టా వెంకటేశంగౌడ్ పాల్గొన్నారు.

కందుకూరు: ముదిరాజ్‌ల కులదైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠపూజలు లేమూరులో వైభవంగా జరిగాయి. ముదిరాజ్ కులస్థులు నిర్మించిన ఆలయం లో అమ్మవారిని ప్రతిష్ఠించారు. అఖిల భారత ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి వీరేశ్ ముదిరాజ్, బాబూరావు, నరేందర్, నారాయణ, యాదయ్య, గణేష్, పరంజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.


లేమూరు పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

కేశంపేట, ఆగస్టు 17 : రైతులకు పంట రుణాల మాఫీ చరిత్రాత్మక ఘట్టం అని మండలం పోమాల్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ అనుమగళ్ల రమేష్ అన్నారు. రూ.2లక్షల వరకు పంట రుణాలు ప్రభుత్వం మాఫీ చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తూ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రుణమాఫీ అయిన రైతులతో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేయించారు. అలాగే రుణాలు మాఫీ కాని రైతులకు త్వరలోనే మాఫీ చేయడానికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.కార్యక్రమంలోమాజీ సర్పంచ్ కృష్ణయ్య,అశోక్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, రాజు, శ్రీనివాస్, బిమోజీ, రమేష్ పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే కాంగ్రెస్ నైజం


వాటర్ ఫిల్టర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

కొత్తూర్, ఆగస్టు 17: ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మల్లాపూర్ ఎస్సీ కాలనీలో నిర్మించిన వాటర్‌ఫిల్టర్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రైతు రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. వాటర్ ఫిల్టర్‌కు ఎమ్మెల్యే 2లక్షలరుపాయలను అందజేయడంపై మాజీ సర్పంచ్ సాయిలు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, సాయిలు, బాల్‌శౌవ్‌రెడ్డి, రంగారెడ్డి, రాందాస్, దయానంద్, మల్లేష్, దర్శన్, శ్రీను పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి


చెక్కు అందజేస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 17: సంస్కృతీ సంప్రదాయానికి ప్రతీకైయిన బోనాల వేడుకలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అన్ని పండుగలకు సమప్రాధాన్యం ఇస్తోందన్నారు. కడ్తాలలో నిర్వహించే పోచమ్మ బోనాల ఉత్సవాలకు శ్రీనివాస్‌రెడ్డి రూ.51వేలు విరాళమిచ్చారు. శనివారం నగదును ఉత్సవ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా వారు శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మల్లేశ్ గౌడ్, జహంగీర్ అలీ, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్‌బాబ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఆలయ కమిటీ సత్యంయాదవ్, రాములు, నాయకులు పాండు, మల్లయ్య,రాజేశ్, రవి, భానుకిరణ్, శేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

'డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను సరఫరా చేయండి'

షాద్‌నగర్, ఆగస్టు 17: డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే శంకర్ ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో చిన్నలోపాలుంటే పరిష్కరించి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. గృహజ్యోతి అమలులో ఇబ్బందులుంటే వాటిని సవరించి అర్హులందరికీ ఉచిత విద్యుత్ అందించేందుకు అధికారులు కృషిచేయాలని తెలిపారు. ఓ పరిశ్రమ నిర్వాహకులు రూ.5కోట్ల విద్యుత్ బకాయి ఉన్నారు. విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ కోసం తన వద్దకు వస్తే తిరస్కరించానని ఎమ్మెల్యే చెప్పారు. ఇలాంటి ఘటనలపై అధికారులు పర్యవేక్షిస్తుండాలని చెప్పారు.

చేవెళ్ల డివిజన్‌లో కొత్త ఏవోలు, ఏఈవోలు వీరే

చేవెళ్ల, ఆగస్టు 17: ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను భారీగా బదిలీలు చేసింది. చేవెళ్ల డివిజన్‌లోని బదిలీలు, కొత్తగా జాయినింగ్ అయ్యారని ఏడీఏ రమాదేవి శనివారం తెలిపారు. చేవెళ్ల ఏవో తులసి స్థానంలో శంకర్‌లాల్ వచ్చారు. మొయినాబాద్‌కు అనురాధ, ఖానాపూర్ క్లస్టర్ ఏఈవోగా జి.పావని వచ్చారు. శంకర్‌పల్లి మండలం మహాలింగాపూర్ క్లస్టర్ ఏఈవోగా మొయినుద్దీన్ వచ్చారు. పర్వేదకు ఎన్.రేణుక, షాబాద్ మండలం మన్మర్రి క్లస్టర్‌కు వై.మౌనిక, హైతాబాద్ క్లస్టర్‌కు రాజేశ్వరి వచ్చారు. చేవెళ్ల ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా సునీల్ వచ్చారు. వారంతా బాధ్యతలు తీసుకున్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

ఆమనగల్లు, ఆగస్టు 17: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మాడ్గుల మండలం కొల్కులపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం 'హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ పూర్' ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యా సంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చి దిద్దుతున్నారన్నారు. అనంతరం గుడితండాలో ముత్యాలమ్మ ఆలయాన్ని మాజీ సర్పంచ్ స్వప్నసురేశ్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి నిధులు ఇవ్వాలని నాయకులు కేశవులు, ఖాదర్, షర్ఫొద్దీన్, మహబూబ్‌అలీ ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ అనురాధ, ఏఎంసీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, రవి, కిషన్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి, లక్యానాయక్, జైపాల్‌రెడ్డి, హరిలాల్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆమనగల్లు, ఆగస్టు 17: శెట్టిపల్లికి చెందిన జెల్ల బాలయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం మృతదేహానికి నివాళి అర్పించి అతడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేల సాయంఅందజేశారు. నాయకులు తదితరులు ఉన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యం

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఆపాలి


షాబాద్‌లో హిందూ ఐక్య వేదిక ర్యాలీ

శంకర్‌పల్లి/షాబాద్, ఆగస్టు 17 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హింసను ప్రభుత్వాలు వెంటనే నివారించాలని హిందూ ఐక్యవేదిక నాయకులు అన్నారు. హిందులపై దాడులను నిరసిస్తూ శనివారం శంకర్‌పల్లిలో బంద్ నిర్వహించారు. రామాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ దేశంలోరాజకీయ పరిణామాలను ఆసరాగా చేసుకొని అల్లరి మూకలు హిందువుల ఇళ్లలో దోపిడీలు, మహిళలపై బలాత్కారాలకు పాల్పడం హేయం అన్నారు. ప్రధాని మోడీ వెంటనే జోక్యం చేసుకుని హిందువులపై దాడులు జరుగకుండా ఆ దేశ అధికారులతో చర్చించాలన్నారు. హిందువులు సంఘటితం కావాలని భజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ అన్నారు. షాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇక్కడి ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం కొందరు నేతలు దాడులను ఖండించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీసీసేన జాతీయాధ్యక్షుడు కృష్ణాయాదవ్, పీసరి సతీష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాము, కిరణ్, మాణయ్య, జంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, యాదగిరి, సత్యనారాయణ, సురేష్, రాహుల్‌గుప్తా, చంద్రయ్య, రవి, ఓంప్రకాశ్, జనార్ధన్, హరీష్, మహేష్, రఘు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


శంకర్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్య వేదిక

మైనారిటీ సంఘం గ్రామ అధ్యక్షుడిగా కరీం



మొయినాబాద్ రూరల్, ఆగస్టు 17: హిమాయత్‌నగర్ గ్రామ మైనారిటీ యువజన సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ కరీం ఎన్నికయ్యారు. రెండేళ్లకోసారి నిర్వహించే సంఘం అధ్యక్ష పదవికి పోటీ ఎవరూ లేకపోవడంతో కరీం ఏకగ్రీవం అయ్యారు. కమిటీ సభ్యులు ఆయనకు నియమాకపత్రం అందజేశారు.

సంక్షిప్తంగా...

● **షాబాద్:** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపాన్నగౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించుకుందామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలపురం వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ..ఆదివారం షాబాద్‌లో గౌడ సంఘం బిల్డింగ్ వద్ద ఉదయం 9గంటలకు సర్వాయి పాపాన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. బహుజన నాయకులు, గౌడ బంధువులు ప్రతీ ఒక్కరు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

● **కడ్తాల్:**చరికొండలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. గౌడ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నేటి ఉదయం 11 గంటలకు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, గౌడ కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ అయిలీ వెంకన్నగౌడ్, రాష్ట్ర నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, అల్లాజీగౌడ్ హాజరవుతున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. గౌడ కులస్థులు, గీత కార్మికులు పాల్గొనాలని వారు కోరారు.

● **చేవెళ్ల:** ఈ నెల 18న చేవెళ్లలోని సత్యసాయి హాస్పటల్‌లో బధిరులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ఆడియాలజిస్ట్ డాక్టర్ ఎం.కృష్ణయ్య, డాక్టర్ గోపాల్ తెలిపారు. వారు మాట్లాడుతూ.. వినికిడి లోపం ఉన్న వారు, పుట్టుకతో చెవుడు, మూగ వారికి, వయసుతో పాటు వచ్చే వినికిడి లోపం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 9082172700 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

● **ఆమనగల్లు:** ఆమనగల్లులోని కట్టమైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ముస్తాబైంది. ఈ నెల 21 నుంచి 23వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. శ్రీ నారాయణి ప్రత్యంగీరా మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న గణపతి పూజ, 22న యజ్ఞం, పూర్ణాహుతి, 23నఅమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఇతర పూజలు ఉంటాయని ఆయన వివరించారు. 500 సంవత్సరాల చరిత్ర కలిగిన కట్టమైసమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి, వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై వేడుకలను జయప్రదం చేయాలని వెంకటయ్య కోరారు.

● **ఆమనగల్లు:** పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ వరంగా నిలుస్తుందని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు వైద్య చికిత్సలకు సాయమందిస్తోందని పేర్కొన్నారు. రాంనుంతలకు చెందిన పూల్యా నాయక్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. చికిత్సకు చేసిన ఖర్చును ప్రభుత్వ పరంగా ఇప్పించి ఆదుకోవాలని గోలి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించాడు. దీంతో ఆయన స్పందించి ప్రభుత్వం ద్వారా రూ.57వేలు మంజూరు చేయించి శనివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ప్రజారోగ్యప రిరక్షణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుమన్ నాయక్, గోపీనాయక్, రూపం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


● **కడ్తాల్:**పల్లెచెలుక తండాకుచెందిన లలితకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.20వేలు మంజూరయ్యాయి. కడ్తాలలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. పేదలకు వైద్య చికిత్సలకు ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లోకేశ్‌నాయక్, హరిచంద్‌నాయక్, సాయిలు, పాండునాయక్, రాజు నాయక్, శ్రీను, చందు, బిక్యానాయక్, నరేశ్, భీమన్, బాలేందర్,యాదగిరి పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


రమేష్(ఫైల్)

కొత్తూర్, ఆగస్టు 17: కొత్తూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్(41) అనే హోంగార్డు అనారోగ్యంతో మృతిచెందాడు. మహేశ్వరం మండలం అమీర్‌పేటకు చెందిన రమేష్ కొన్నేళ్లుగా కొత్తూర్ పీఎస్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో అతడు నగరంలోని ఓ ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించాడు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ఎస్ఐ జి.శ్రీనివాస్ గ్రామానికి వెళ్లి రమేశ్ మృతదేహానికి నివాళులర్పించారు.

ఆమనగల్లు ఏవోగా శ్రీనివాస్‌గౌడ్


శ్రీనివాస్‌గౌడ్ సన్మానిస్తున్న రైతులు

ఆమనగల్లు, ఆగస్టు 17: ఆమనగల్లు వ్యవసాయ శాఖ అధికారిగా శ్రీనివాస్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించా రు. సూర్యపేట జిల్లా మేళ్ల చెరువు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన అరుణకుమారి మాడ్గులకు బదిలీ అయ్యారు. ఆమె 11ఏళ్లు ఇక్కడ పనిచేశారు. నూతన ఏవో శ్రీనివాస్‌గౌడ్‌ను పలువురు నాయకులు, రైతులు సత్కరించి అభినందించారు.

కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన

మహేశ్వరం, ఆగస్టు 17 : మహేశ్వరంలో రెండు ఎకరాల స్థలంలో 3 అంతస్తులతో రూ.24కోట్లతో నిర్మించ తలపెట్టిన జూనియర్ సివిల్ జడ్జి సహా 17వ అదనపు ప్రథమ శ్రేణి జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాలకు శనివారం భూమిపూజ చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి పట్టాభిరామారావు, మహేశ్వరం కోర్టు న్యాయాధి కారి అపర్ణ, డీసీపీ సునీతారెడ్డి, న్యాయవాది హరికిషన్‌గౌడ్ పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న జిల్లా న్యాయాధికారి పట్టాభిరామారావు